# ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఆఫ్రికా దేశాలు

**ఆఫ్రికా దేశాల్లో 2006 నుంచి మొదలైన ఆర్థిక విస్తరణ నిరాటంకంగా కొనసాగే సూచనలెన్నో కనిపిస్తున్నాయి. మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను చేరాలంటే... ఈ దేశాలు ఏడు నుంచి ఎనిమిది శాతం మేర వృద్ధి సాధించాల్సిందే. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అభిప్రాయం ప్రకారం... ఆఫ్రికా దేశాల కరెన్సీ మూల్యాంకనం, విలువలో హెచ్చుతగ్గులు ఆఫ్రికన్ స్టాక్ మర్కెట్‌లో ఓ ముఖ్యమైన రిస్క్ కారకంగా నిలుస్తాయి. వినిమయ రేటులో నమోదయ్యే అధిక ఒడిదుడుకులు.. విదేశీ పెట్టుబడుల తగ్గుదలకు దారి తీసే అవకాశాలున్నాయి.**

2002 తర్వాత ఆఫ్రికా దేశాల్లో స్థూలదేశీయోత్పత్తి స్థిరంగా సాగుతోంది. ఫలితంగా గడిచిన ఏడేళ్లలో అది.. ప్రపంచ వృద్ధి రేటు కంటే ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉంటోంది. ప్రపంచ ఆర్థికవృద్ధి తరుగుదల ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాలపై స్పష్టమైన ప్రభావం చూపినా.. ఆ ప్రాంతంలో జరుగుతున్న ఆర్థిక విస్తరణ ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగే సూచన లున్నాయి. అనేక దేశాల్లో అమల్లో ఉన్న స్థూల ఆర్థిక విధానాలు వాణిజ్యం పట్ల విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి కూడా దోహదపడ్డాయి. ప్రపంచ జీడీపీలో (కొనుగోలు శక్తిసామ్యం ఆధారంగా) ఆఫ్రికా జీడీపీ గడిచిన నాలుగేళ్ల నుంచి నిలకడగా ఉంది. 2004- 2005లో ప్రపంచ జీడీపీలో 3.3 శాతం ఉన్న ఆఫ్రికా వాటా 2006- 2007లో 3.4 శాతానికి చేరింది. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం గత ఐదేళ్ల ఆఫ్రికా సగటు జీడీపీ వృద్ధి 5 శాతం. 2007లో ఈ దేశాల జీడీపీ వృద్ధి 5.7 శాతం. కాగా, 2008లో 6.5 శాతానికి పెరుగుతుందని అంచనా. దీనికి కారణం... చమురు, చమురేతర ఖనిజాలకు ప్రపంచ మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉండటం, ఈ రంగాల్లో పెట్టుబడులు పెరగడం... ఆఫ్రికాలోని అనేక దేశాల్లో వ్యవసాయానికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉండటమేనని అభిప్రాయం. మిలీనియం అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2015 నాటికి ఈ ఖండంలో పేదరికాన్ని సగానికి తగ్గించాలంటే జీడీపీ వృద్ధి 7 నుంచి 8 శాతం వరకు నమోదుకావాలి. అంగోలా, గినియా, నైజీరియా దేశాల్లో చమురు ఉత్పత్తి పెరగడం, ప్రపంచ చమురు ధరల్లో పెరుగుదల ఈ ప్రాంతంలో ఆర్థిక విస్తరణ మెరుగుపడేందుకు ఊతమిచ్చింది.

## ఆ మూడు దేశాలు తప్ప..

జింబాబ్వే, చాద్, కొమరోస్ మినహా ఆఫ్రికాలోని మిగిలిన అన్ని దేశాలు 2007లో ధనాత్మక వృద్ధి సాధించాయి. ఈ ఖండంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దక్షిణాఫ్రికా.. 2007లో ఈ ఖండంలోని మొత్తం జీడీపీలో 16.7 శాతం వాటా సాధించింది. తర్వాత స్థానంలో ఈజిప్ట్ నిలిచింది. ఈ ఖండంలోని అతిపెద్ద 10 దేశాల్లో అంగోలా, కెన్యాలు స్థానం పొందాయి. ముఖ్యంగా చమురు ఉత్పత్తిలో పెరుగుదల అంగోలా వృద్ధికి దోహద పడింది. యుద్ధానంతరం పునర్నిర్మాణ కార్యక్రమాలు వేగవంత మవడంతోపాటు, వలస వెళ్లిన ప్రజలకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించడంలో సఫలమైంది. ఫలితంగా వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో అధిక వృద్ధి సాధ్యమైంది. అవినీతి పెచ్చరిల్లినా అంతర్జాతీయ విత్త సంస్థల ఆర్థిక సహకారంతో కెన్యా లబ్ధి పొందింది. వాస్తవ తలసరి స్థూలదేశీయోత్పత్తి సూచికగా ఆయాదేశాల్లో ఆర్థిక కార్యకలాపాల హెచ్చుతగ్గులను గమ నించవచ్చు. తలసరి జీడీపీలు ఎక్కువగా ఉన్న దేశాల్లో తక్కువ పేదరికం, ఎక్కువ ఆదాయ స్థాయిలను గమనించ వచ్చు. ఈ ఖండంలో ఉత్తర ఆఫ్రికాలో తలసరి జీడీపీ ఎక్కువగా, తూర్పు ఆఫ్రికాలో తక్కువగా ఉంది.

## జనాభా:

ప్రస్తుత జనాభాకు అదనంగా.. ప్రతి ఏటా తక్కువ అభివృద్ధి చెందిన (అల్పాభివృద్ధి) దేశాల్లో 80 మిలియన్ల ప్రజలు, అధిక అభివృద్ధి సాధించిన దేశాల్లో ఒక మిలియన్ జనాభా చేరుతున్నారు. ఈ మార్పులు ఆర్థికాభివృద్ధి, విద్య, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో జనాభా వృద్ధిరేటు తక్కువగా ఉన్నా ఆఫ్రికాలో ఎక్కువే. ప్రపంచంలో అధిక జననరేటు కలిగిన మొదటి పది దేశాల్లో తొమ్మిది ఆఫ్రికా ఖండంలోనివే. మధ్య ఆఫ్రికాలో కేంద్రీకృతమైన దేశాల్లో జననరేటు ఇంకొంచెం ఎక్కువ. 2007లో ఆఫ్రికా జనాభా 938.3 మిలియన్లు. గత ఏడాదితో పోల్చితే జనాభా వృద్ధి రేటు 0.3 శాతం నమోదైంది. గత ఏడాది ప్రచురించిన ప్రపంచ జనాభా డేటా షీట్ ప్రకారం... అధిక జనాభా గల మొదటి పది దేశాల్లో నైజీరియా ఏడో స్థానంలో ఉంది. శిశు మరణాలు సగటున ఉత్తర ఆఫ్రికా దేశాల్లో 42 శాతం, సబ్ సహారా దేశాల్లో 92 శాతం. ఆఫ్రికా దేశాల్లో హెచ్ఐవి బాధితులూ ఎక్కువే. ఈ ఖండంలో 22.5 మిలియన్ల ప్రజలు హెచ్ఐవీతో బాధపడుతున్నారు. వీరిలో కొద్ది మందికి మాత్రమే life prolonging antiretroviral డ్రగ్స్ వినియోగించే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఆ దేశాల్లో కొంత మేర ఆరోగ్య సౌకర్యాలు మెరుగుపడ్డా... అంతేస్థాయిలో పెరుగుతున్న పేదరికం వల్ల హెచ్ఐవీ పెద్ద సవాల్‌గా పరిణమించింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే ఈ దేశాల్లో జీవన ప్రమాణం కూడా తక్కువే. హెచ్ఐవీ, క్షయ, మలేరియా వంటి వ్యాధులే... ఈ దేశాల్లో గత 30 ఏళ్లుగా జీవన ప్రమాణం తక్కువగా

ఆఫ్రికా ఖండంలో 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు - 2007

| దేశం | జీడీపీ (బిలియన్ డాలర్లలో) | జనాభా (మిలియన్లు) | వాస్తవ జీడీపీ వృద్ధిరేటు (శాతం) | మొత్తం ఆఫ్రికా జీడీపీలో దేశ వాటా |
|---|---|---|---|---|
| దక్షిణాఫ్రికా | 467.60 | 47.8 | 5.0 | 18.1 |
| ఈజిప్ట్ | 431.90 | 80.3 | 7.2 | 16.7 |
| నైజీరియా | 294.80 | 135.0 | 6.1 | 11.4 |
| అల్జీరియా | 268.90 | 33.3 | 4.6 | 10.4 |
| మొరాకో | 127.00 | 33.7 | 2.1 | 4.9 |
| సూడాన్ | 107.80 | 39.4 | 12.8 | 4.2 |
| అంగోలా | 80.95 | 12.3 | 16.3 | 3.1 |
| లిబియా | 78.79 | 6.0 | 5.4 | 3.0 |
| ట్యునీషియా | 77.16 | 10.3 | 6.3 | 3.0 |
| కెన్యా | 57.65 | 36.9 | 6.3 | 2.2 |

ఆధారం:
ఐఎంఎఫ్ వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్, అక్టోబర్ 2007.

ఉండడానికి కారణాలు. అధిక తలసరి స్థూల దేశీయోత్పత్తికి, మానవాభివృద్ధికి దగ్గర సంబంధం ఉందని పరిశోధనలు తెలుపుతున్నాయి. తలసరి స్థూల దేశీయోత్పత్తి, జీవన ప్రమాణం ఇతర ఆఫ్రికా దేశాల కన్నా లిబియాలో ఎక్కువ. దీనికి కారణం ఇక్కడ హెచ్ఐవీ బాధితులు ఒక శాతం కంటే తక్కువగా ఉండటమే. దక్షిణాఫ్రికా జనాభాలో 18 శాతం ఎయిడ్స్‌కు గురైనందువల్ల.. తలసరి స్థూల దేశీయోత్పత్తి ఎక్కువగా ఉన్నా మానవాభివృద్ధి తక్కువగా ఉంది. మౌలిక సౌకర్యాలు తక్కువగా ఉండటం, హెచ్ఐవీ ఎయిడ్స్ పెరగడంతో జాంబియాలో జీవన ప్రమాణం, తలసరి స్థూల దేశీయోత్పత్తి తక్కువగా ఉంది.

## వ్యవసాయ ఉత్పత్తి:

ఆఫ్రికా ఖండంలోని ఎక్కువ దేశాలు వర్షాధార వ్యవసాయంపై ఆధారపడి ఉంటాయి. తరచుగా సంభవించే కరవు కాటకాలు, వ్యవసాయోత్పత్తుల ఎగుమతి ధరల్లో ఒడిదొడుకులు కారణంగా ఈ దేశాల్లో ఆర్థిక నిర్వహణ సమస్యాత్మకంగా పరిణమించింది. వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకున్న ప్రజలకు వాతావరణంలో ఏర్పడే మార్పులు పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. ఈ మార్పుల కారణంగా... వ్యాధులు తీవ్రంగా ప్రబలడం, దుర్భిక్ష పీడిత ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరగడం, వరదలు వంటి సమస్యలు తలెత్తాయి. 2006లో ఆఫ్రికాలో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల విలువ 454 బిలియన్ డాలర్లు. కాగా, 2007లో అది 391.3 బిలియన్ డాలర్లకు తగ్గింది. వ్యవసాయోత్పత్తుల్లో ఉత్తర ఆఫ్రికా ప్రథమ స్థానంలో, తూర్పు ఆఫ్రికా రెండో స్థానంలో ఉన్నాయి. మొత్తం ఆఫ్రికా వ్యవసాయోత్పత్తిలో సబ్ సహారా ఆఫ్రికా వాటా 71 శాతం. ఆఫ్రికాలో ప్రధాన పంటలు కాఫీ, పత్తి, కోకో బీన్స్, పండ్లు కూరగాయలు, ధాన్యపుగింజలు. వీటిలో పండ్లు, కూరగాయలు, ధాన్యపు గింజలు, మాంసం ఉత్పత్తులు ఉత్తర ఆఫ్రికాలో కేంద్రీకృతమయ్యాయి. ఈ ఖండంలో కోకో బీన్స్ ఉత్పత్తిలో 92 శాతం, నూనె గింజల ఉత్పత్తిలో 43 శాతాన్ని పశ్చిమాఫ్రికా సాధించింది.తమ స్థూల దేశీయోత్పత్తుల పెరుగుదలకు చాలా దేశాలు వ్యవసాయరంగంపై ఎక్కువగా ఆధారపడ్డాయి. సోమాలియా, లిబేరియా దేశాల జీడీపీలో వ్యవసాయరంగం వాటా 60శాతం. మరికొన్ని దేశాల జీడీపీలో వ్యవసాయరంగం వాటా ఎక్కువగా ఉన్నప్పటికీ వ్యవసాయోత్పత్తుల సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. లిబేరియా జీడీపీలో వ్యవసాయరంగం వాటా 76.9 శాతం. అయితే అక్కడ మొత్తం వ్యవసాయోత్పత్తుల విలువ 1.15 బిలియన్ డాలర్లు మాత్రమే. ఆఫ్రికా ఎగుమతులు ప్రధానంగా 4 వస్తువులపై కేంద్రీకృతమయ్యాయి. అవి కాఫీ, టీ, ముడి చెరకు, కోకోవా. ముడి చెరకు దక్షిణాఫ్రికా, మధ్య దక్షిణ ప్రాంత ఆఫ్రికా నుంచి, కోకోవా పశ్చిమ ఆఫ్రికా నుంచి ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఈ ఖండంలోని వ్యవసాయోత్పత్తుల్లో దక్షిణాఫ్రికా అతిపెద్ద సప్లయ్‌దారునిగా పేరుగాంచింది. 2006లో ఆఫ్రికా మొత్తం వ్యవసాయ ఎగుమతుల విలువ 32 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ప్రపంచ వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల విలువలో 3 శాతం సాధించింది.

ఆఫ్రికా వ్యవసాయోత్పత్తులకు 48.9 శాతంతో యూరప్ అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. తర్వాత స్థానంలో 19.3 శాతంతో ఆసియా ఉంది. సబ్-సహారా ఆఫ్రికా నుంచి చైనాకు చేసే ఎగుమతులు 2000 తర్వాత 30 శాతం మేర వార్షిక వృద్ధి సాధించాయి.

## వరదలతో వెతలు:

ఆఫ్రికాలో గత మూడు దశాబ్దాల వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే... 2007లో సంభవించిన భారీ వరదలు అత్యంత భయంకరమైనవి. 3 నెలల వ్యవధిలో 20 దేశాల్లో సుమారు 300 మంది ప్రజలు మరణించారు. దీంతో వలసలు పెరిగాయి. మౌలిక సౌకర్యాలు తీవ్రంగా దెబ్బతిని, పంట నష్టం, పశు నష్టం భారీగా సంభవించింది. వ్యాధులు కూడా విజృంభించడంతో ఈ దేశాలు విదేశీ సహాయంపై ఎక్కువగా ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. ఒకవైపు కరవు కాటకాలు మరోవైపు అంతర్జాతీయంగా వస్తువుల ధరలు పెరగడంతో 2007లో ప్రజలకు ఆహార భద్రత కరవైంది. ఆఫ్రికా ఖండంలో మొక్కజొన్న అధికంగా పండించే దేశంగా పేరు పొందిన దక్షిణాఫ్రికాలో ఈ ఉత్పత్తి 11మిలియన్ టన్నుల నుంచి 7 మిలియన్ టన్నులకు తగ్గింది. అయితే 2007 చివర్లో వాతావరణ అనుకూలత కారణంగా ఈ స్థితి కొంత మెరుగుపడింది. తద్వారా గణనీయ ఉత్పత్తి జరిగింది. ఆర్థిక, రాజకీయ స్థిరత్వం లేనందువల్ల జింబాబ్వే కరెన్సీ విలువ తగ్గుదల నిరంతరం కొనసాగుతూనే ఉంది. మూల్యనీకరణ, ఆఫ్రికన్ కరెన్సీ విలువలో భారీ ఒడిదొడుకులు భవిష్యత్తులో ఆఫ్రికన్ స్టాక్ మార్కెట్ ఉనికిని దెబ్బ తీసే ప్రమాదం ఉంది. మారకపు రేటు విలువలో ఒడిదొడుకులు నమోదవకుండా ఈ దేశాలు ప్రయత్నించాలి. అప్పుడే విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో వృద్ధి... మిలీనియం అభివృద్ధి లక్ష్యాలు సాధ్యపడతాయి.

## అబ్జెక్టివ్ క్వశ్చన్స్

- ఆఫ్రికా ఖండంలోని దేశాల్లో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న దేశం?
  - జింబాబ్వే
- శిశు మరణాలు ఎక్కువగా ఉన్న ప్రాంతం?
  - సబ్ సహారన్ ఆఫ్రికా
- ఆఫ్రికాలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల్లో ఏ ప్రాంతం వాటా ఎక్కువ?
  - సబ్ సహారన్ ఆఫ్రికా
- ప్రపంచ వ్యవసాయ ఎగుమతుల విలువలో ఆఫ్రికా వాటా?
  - 3 శాతం
- ఆఫ్రికాలో వ్యవసాయ ఉత్పత్తుల అతిపెద్ద సప్లయ్‌దారు?
  - దక్షిణాఫ్రికా
- ఆఫ్రికా వ్యవసాయ ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్?
  - యూరప్
- ఆఫ్రికా ఖండంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ?
  - దక్షిణాఫ్రికా
- ఆర్థిక కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం తెలుసుకోవడానికి ఉపయోగించే సూచిక?
  - వాస్తవ తలసరి జీడీపీ
- ఆఫ్రికా ఖండంలో ఏ ప్రాంతంలో తలసరి జీడీపీ ఎక్కువ?
  - ఉత్తర ఆఫ్రికా
- ఇథియోపియా ఏ ప్రాంతానికి సంబంధించినది?
  - తూర్పు ఆఫ్రికా

SAKSHI